# వసంతకోకిల

ఈ రోజు ఆఫీసు చాలా కళగా, క్రొత్తగా వుంది. పది గంటలకు ఆఫీసయితే పదకొండు వరకూ సాధారణంగా సీట్లు నిండేవికావు. జిడ్డు ముఖంతో రాధాకృష్ణ, ప్రపంచ భారమంతా తనే మోస్తున్నానంత ఫీలింగ్‌తో సీతారావ్, నేను లేకపోతే ఆఫీసే లేదన్నట్లు ఫోజులిచ్చే చలపతి ముందుగానే వచ్చేసారు. ఏమైంది వీళ్లందరికి ఒక్కసారిగా అనిపించింది నాకు. ఏమైతేనేం అనుకుంటూ సీట్లో కూర్చుండగానే ఫోన్ రింగయ్యింది.

'ఒక్కసారి ఇలా రావోయ్ ప్రసాద్' ఫోన్‌లో మేనేజర్.

ఫోన్ క్రెడిల్ చేసి ఆయన రూమ్‌కి వెళ్ళాను. అప్పటిక్కాని నాకు తెలివిరాలేదు. ఈ వేళ మా ఆఫీసులో ఓ కొత్తమ్మాయి జాయిన్ అవుతుంది కదూ... తట్టలేదు ఈ మొద్దు బుర్రకి. అందుకా ఈ ఫోజుల రాయుళ్లు ఇంత తొందరగా వచ్చారు అనుకుంటూ.

'గుడ్‌మార్నింగ్ సర్' మేనేజర్ని విష్ చేసాను.

'గుడ్ మార్నింగ్ మిష్టర్ ప్రసాద్— కమాన్ టేక్ యువర్ సీట్. చూడూ... ఈ అమ్మాయి పేరు సుధ. ఈ రోజు నుండి మన ఆఫీసులోనే పని చేస్తుంది. కాస్త పని నేర్పు.''

''ఓ...కే... సర్...'' అంటూ లేచాను.

''థాంక్యూసర్'' అని మేనేజర్‌కి చెప్పి నన్ననుసరించిందా అమ్మాయి.

సీటు చూపించి కూర్చోమన్నాను.

నాకు మాత్రం కొత్తగా వుంది. ఇప్పటి వరకూ నాకు అమ్మాయిలతో మాట్లాడ్డం తెలీదు. అసలే బిడియం ఎక్కువ. వారితో మాట్లాడితేనే నా గుండెలు దడ దడ లాడుతాయి. అందుకే మా ఆఫీసువాళ్లు నన్నో బుద్ధావతారం అనే కాకుండా ఇంకా చెప్పకూడని పేర్లతో పిలుస్తుంటారు. వీటన్నింటికి తోడన్నట్లు నా ఖర్మ ఆ అమ్మాయి, నేను ఒకే రూమ్‌లో కలిసి పనిచేయాల్సి రావడం, అందుకే ఎందుకైనా మంచిదని ముందుగా ఆంజనేయ దండకం మొదలు పెట్టాను.

'హలో'

తృళ్ళిపడ్డాను.

ఆ కళ్లు విరిపిగా నవ్వుతున్నాయి. దొరికావులే. ఆడది కన్పిస్తే చాలు ఊహల్లో తిరుగుతారీ మగాళ్లు అన్నంత ఇదిగా.

''ఎక్కడున్నారు మీరు.''

''ఆ... ఆ... లేదు. అవునూ మీ పేరేమన్నారు'' కంగారుగా ప్రశ్నించాను.

''నేనేమీ అనలేదు'' మళ్లీ అదేనవ్వు.

''ఓ... అయాంసారీ... సుధకదూ...''

ఆమె కళ్లు విరిపిగా నవ్వుతున్నాయి, దొరికావులే అన్నంతగా.

నా ముఖం ఎర్రబడింది. నేను అనుకున్నంత అయ్యింది. ఏమనుకుంటుందో ఏమో? చీర కనబడితే చాలు చుట్టుకుపోయే రకం అనుకుందేమో...? కాస్త బాధనిపించింది. మళ్లీ... నాలో నేనే... అనుకోనీ ఏం? నాకేం భయం! నేనంటే ఏమిటో నాకు తెలుసుకదా! ఎవరేమనుకుంటే నాకేం? అనే ఆత్మ సమాధానం.

ఏమైతేనేం పదిహేను రోజులు గడిచాయి. కాస్త అలవాటు పడ్డాను. ఇప్పుడు సుధ ఆఫీసుకు ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూడ్డం నావంతయ్యింది. సుధ ఆఫీసుకు రాని రోజు ఎంతో బాధ అనిపించేది. ఒక్క పది నిముషాలు ఆఫీసుకు రావడం లేటయితే ఈ వేళ ఆఫీసుకురాదేమో! సెలవేమో! అనే ఉత్కంఠతతోపాటు, ఏమై ఉంటుందా అని కుతూహల్లం, అలజడి, ఆతృత నాలో పెరిగిపోయేది. నా ఆతృత అలావుంటే అప్పుడు విరునవ్వుతో అపుడే విరిసిన గులాబిలా, స్వచ్ఛంగా, నిండుగా, ఆహ్లాదంగా వచ్చేది. హమ్మయ్య... ఎంతో ప్రశాంతంగా తయారయ్యేది నా మనస్సు. ఎందుకిలా అవుతుందని నన్ను నేనే ప్రశ్నించుకొనేవాణ్ణి. ఇది అభిమానమో, ప్రేమో, అనురాగమో, తెలియని అనుబంధమో... ఎంత వరకూ వెళ్తుందో అని నాలో ఎన్నో ప్రశ్నలూ... భయాలూ.

ఒక్కొక్కప్పుడు అనిపించేది సుధ ఆఫీసుకు రాకపోతే ఎలా? అని. ఆమె రాకతో నాలో ఏదో క్రొత్త ఆనందం వచ్చింది. ఎడారి వంటి ఏ అనుభూతులూ లేని ఈ జీవితంలో ఒయాసిస్సులా, పన్నీటి జల్లులా, ఆమె ప్రవేశంతో ఏవో మాటలకందని భావాలు నాలో ఏర్పడ్డాయి.

తను కనిపించకపోతే...?

అమ్మో... ఆ వూహే భరించలేను. ఆఫీసులో ఆమె ముఖం. విరిసినవ్వు, తనను వుడికిస్తూ తను నవ్వే ఆ నవ్వును, దూరం చేసుకోగలదా ఈ మనస్సు? తట్టుకోగలదా ఈ చిన్ని గుండె? తను లేని ఈ జీవితాన్ని?

ఈ వూహలే ఆఫీసును విడిచిపెట్టినా నన్ను నిరంతరం వెంటాడేవి.

నా వూహలకు, నా ఆలోచనలకు అక్షరరూపాన్నిచ్చి నేను వ్రాసిన ప్రతి కవితకు తను ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చేది. అనుక్షణం సుధతో గడపాలని, ఆ విరిపి కళ్లను చూస్తూ, ఆ అందమైన పెదాలను ఒక్కసారైనా ముద్దు పెట్టుకోవాలన్న కోరిక నాలో అంతకంతకూ బలీయమై పోసాగింది.

కానీ... అంతలోనే...

తన ఊహలెలా వున్నాయో? నన్ను తిరస్కరిస్తే... భరించగలనా... వద్దు... తను కన్పిస్తే చాలు... తన అందమైన ముఖారవిందాన్ని మనగలనా... వద్దు... తను నా ఎదురుగా వుంటే చాలు...నాకింకేమీ అవసరం లేదు. తనను చూస్తూ ఈ జన్మంతా గడిపేస్తాను.

ఇలా సాగే నా ఆలోచనలకు అంతం వుండేది కాదు. ఈ ఆలోచనలతోనే మరో మూడు నెలలు గడిపేసేను.

★ ★ ★

'ప్రసాద్ మీకో శుభవార్త' ఎంతో సంతోషంగా అంది ఓ రోజు.

'చెప్పండి' అన్నాన్నేను.

'రేపట్నించి మిమ్మల్ని ఉడికించి, ఏడిపించే ఈ సుధ ఆఫీసుకు రాదు.'

నా గుండెల్లో శూలాలు దిగాయి, మెదడు మొద్దుబారింది. కళ్ళల్లో కన్నీటి పొరతో అక్షరాలు మసగ్గా కన్పడుతున్నాయి.

మారోజు త్రినాథ్

'ఎందువల్ల' భారంగా తలవంచుకునే అడిగాను.

'మా నాన్నగార్కి బాంబే ట్రాన్స్‌ఫర్ అయ్యింది.'

'ఓహో...' ఆ ఒక్కమాట కూడా నా పెదాలు దాటి రాలేదు. నాలో ఏదో నిస్సత్తువ. నా గుండెల్ని పిండేస్తున్నంత బాధ. చెప్పలేని బాధ. తన సుధ, తన కలల జాబిల్లి రేపట్నించి ఆఫీసుకు రాదా...!

తప్పదు. కనీసం ఈ రోజైనా తనతో మనసు విప్పి మాట్లాడాలి. ఈ మానసిక క్షోభ తగ్గించుకోవాలి. నా అదృష్టమో... ఏమో... ఇద్దరం ఒకే రూమ్‌లో పని చేస్తున్నాం కాబట్టి ఆఫీసు అయిపోయిన తర్వాత తనతో మాట్లాడాలని నిర్ణయించ[illegible]న్నాను.

'....ఆఖరి రోజుకదా... ఒక్క పది ...లు ఆఫీసు అయిపోయాక వుందామా' నా ...తు నీరసంగా పలికింది.

ఒక్క క్షణం నా ముఖంలోకి చూసింది. ఆమె కళ్ళల్లో, ముఖంలో కొంత బాధ కనిపించింది. ఎందుకో... నా కోసమేనేమో... తను కూడా నాలాగా బాధపడుతుందేమో... అంతలోనే మళ్ళీ నిరాశావాదం వన్నావహించింది. నా కోసం ఎందుకై వుంటుంది. ఉద్యోగం వదిలిపోతున్నందుకేమో...

నా ఆలోచనలు నా మెదడును తినేస్తున్నాయి తన నుండి 'అలాగే' అన్న మాటలు వినిపించడంతో ఇహ లోకంలోకి వచ్చాను.

సాయంత్రం 5 అయింది.

అంతా వెళ్లిపోయారు. నేనూ... సుధ తప్ప.

తనకెదురుగా సీటు జరుపుకొని కూర్చున్నాను.

'సుధా... నిజంగా వెళ్లిపోతున్నావా' నూతిలో నుండి వస్తున్నట్లుగా వుంది నా స్వరం.

'అవును... ఎందుకలా అడుగుతున్నారు' తన కళ్లల్లో ఆశ్చర్యం.

నేనింక ఆగలేకపోయాను. పూర్తిగా బరస్ట్ అయ్యాను.

'సుధా... ఐ లవ్ యూ... నిన్ను చూడకుండా వుండలేను. వుండలేకపోతున్నాను. నన్ను విడిచి వెళ్ళకు. ఇన్నాళ్ల నా ఒంటరితనం నీ రాకతో మాయమయ్యింది. నీ నుండి ఎటువంటి స్పందనా రాకపోయినా నీ మీద అభిమానం, ప్రేమానురాగాలు అనంతంగా నా మదిలో పెరిగిపోయాయి నా కోసమే నీవన్న భావం నన్ను నిలువనీయడం లేదు సుధా' నా గుండెల్లోని బాధనంతా తన ముందు పరిచాను.

ఇంకా తనతో ఎంతో చెప్పాలని వుంది. కాని మాటలు రావడం లేదు. భాష చాలడంలేదు.

సుధ కళ్ళల్లో సన్నని కన్నీటిపొర నా దృష్టి నుండి దాటిపోలేదు. తను మౌనంగా వుండిపోయింది.

'సుధా... నీ మౌనంతో నన్ను బాధించక... ఏదో ఒకటి మాట్లాడు.'

ఎంత ప్రయత్నించినా సుధ నోటి నుండి చిన్న మాట కూడా రాలేదు.

నాలో కోపం, బాధ కలిగాయి. ఈ మౌనానికి, కన్నీటికి అర్థం ఏమిటి? నాలో శేష ప్రశ్నలు.

కాని ఇంతలోనే

'పదండి... లేటయిపోతుంది.'

'నా ప్రశ్నలకు సమాధానం' అడిగాన్నేను.

'మీరెందుకలా ఫీల్ అవుతున్నారో నా కర్థం కాకుండా వుంది. ఒక్క మూడు నెలలు కలిసి పనిచేసినంత మాత్రాన మీరు నన్ను ఈ విధంగా చూస్తారనుకోలేదు. ఒక స్నేహితునిగా మీరంటే నాకు అభిమానం. అందుకే మిమ్మల్ని విడిచిపెట్టి వెళ్తున్నందుకు బాధగా వుంది. ఇక ప్రేమంటారా... దానిమీద నాకు నమ్మకంలేదు. ఇప్పటి మీ పరిస్థితి మీద జాలిగా వుంది.'

ఆమె నుండి వెలువడిన మాటలు నన్ను చిత్రహింసలు చేస్తున్నాయి.

'వెళ్దామా' అంది ఒక్క నిముషం ఆగి.

మౌనంగా లేచాను. తన మనసు ఇంత పాషాణ



మా...? లేక ఒక మగాడు ప్రేమగా, ఇంత ఆర్తిగా అడిగినందుకు విన్న చూపా... లేదా ఛీత్కారమా... ఏది ఏమైనా... తను లేకుండా... తనని చూడకుండా రేపట్నించి ఎలా? అన్నదే నా సమస్య.

భగవాన్... ఎందుకు నాకీ శిక్ష. తనని చూడకుండా, తను లేకుండా బ్రతికే ఈ జీవితం నాకొద్దు.

★ ★ ★

ఆ రోజు మొదలుకొని సుధను మళ్లీ చూడలేదు. వెళ్లిపోయుంటుంది ఈ మనసును గాయం చేసి. ఎన్నో రాత్రులు నిద్రలేమితో గడిపాను. తన వూహలతో, తనపై పెంచుకున్న ఆశలతో అనుక్షణం వెంటాడుతూ వుంటే పగిలిన గుండెతో నిర్లిప్తంగా రోజుల్ని వెళ్లదీస్తున్నాను.

★ ★ ★

ఆలస్యంగా ఆఫీసుకు వచ్చిన నాకు టేబిల్ మీద ఉత్తరం కనిపించింది. ముత్యాల్లాంటి అక్షరాలతో ఫ్రం అడ్రసు దగ్గర 'సుధ' అని కనిపించేసరికి నా ఆనందానికి అవధులు లేవు. ఇన్నాళ్లకు సుధకు నేను కనిపించాను కాబోలు అని అనుకొని ఆత్రంగా ఉత్తరం విప్పాను.

డియర్ ప్రసాద్...

ఇన్నాళ్ల తర్వాత ఈ వుత్తరం మీకు ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు. కానీ... విధి బలీయమైనది. ఎందుకో తెలుసా! మీ ఆఫీసులో, మీ సమక్షంలో పనిచేసిన రోజులే నాకూ... నా జీవితానికి తీయని జ్ఞాపకాలు. మీ ప్రవర్తన, మీ మంచితనం నన్ను ముగ్ధురాలను చేసాయి. మీ నుండి ఎంతో ప్రేమను పొందాలనుకున్నాను. భగవంతుడే ఉద్యోగం రూపంలో ఆ అవకాశాన్ని ఇచ్చాడని మురిసిపోయాను.

ఉత్తరం చదువుతున్నకొద్దీ నాలో ఆనందం కన్నీళ్ళరూపంగా మారుతుందో ఏమో... అక్షరాలు మసకబారుతున్నాయి. మరెందుకలా ప్రవర్తించావు సుధా.

వేల... వేల... ప్రశ్నలు. నేనేం తప్పు చేసాను.

ఆత్రంగా మళ్లీ చదవడం ప్రారంభించాను.

మీకు గుర్తుండే వుంటుంది. నేను ఉద్యోగం మానేసే నెలలో ఒక వారం సెలవు పెట్టాను. ఎందుకో తెలుసా. మెడికల్ చెకప్ కోసం. అప్పుడే తెలిసింది నాకు. నన్ను మీ నుండి, ఈ ప్రపంచం నుండి వేరుచేసే జబ్బు పెరుగుతుందని.

నా దురదృష్టానికి ఏడ్చాను. కన్నీళ్ళతో భగవంతుణ్ణి వేడుకున్నాను. కొన్నాళ్లైనా నాకు జీవితాన్ని ప్రసాదించమని. కానీ అది జరగదని తెలుసుకున్నాక, మీకు నాపై ఆశలు కల్పించకూడదని నేను అనాథలా తిరస్కరించాను. మీకు ఈ లెటర్ అందేసరికి నేను పంచభూతాల్లో కలసిపోతాను.

కానీ ఒక్కటి మాత్రం నిజం ప్రసాద్. మీ కోసం మీ ప్రేమ కోసం, ఓ స్వచ్ఛమైన హృదయం కోసం మళ్లీ జన్మంటూ వుంటే పుడతాను.

ఒక స్త్రీగా, మీ కోసం ప్రేమ సామ్రాజ్యాన్నే స్థాపిస్తాను.

అందాకా మీకేమీ కాలేని అభాగిని,
సుధ.

ఉత్తరం చదివిన నాలో చలనం నశించింది. సుధ చనిపోయిందంటే నమ్మబుద్ధి కావడం లేదు. నో... సుధ చనిపోలేదు. చనిపోదు. ఎంత సంభాళించుకుందామన్నా ఆగని నా వేదనకు అంతంలేదు.

సుధ నన్నొదిలి పోయిందా... సుధా నా ప్రాణమా. నీవు లేని ఈ ప్రపంచం నాకొద్దు. ఇన్నాళ్లూ నీవు నాకు లేకపోయినా, ఎక్కడో సుఖంగా సంతోషంగా వున్నావనే తలంపే నన్ను ఇప్పటివరకూ బ్రతికించింది. నీ తిరస్కారం వెనుక ఇంతటి విషాదం వుందనుకోలేదు. సుధా... నీ వియోగం ఇంతటి విషాదమౌతుందనుకోలేదు.

నీవు లేని ఈ ప్రపంచంలో నాకేం పని సుధా! నేనూ నీతోనే వస్తాను అని స్థిరమైన నిర్ణయానికి వచ్చిన నేను చివరిగా ఈ ప్రపంచానికి నా కవితా ఘోషను వదిలి సుధను చేరుకోవడానికి లేచాను.

## ప్రక్క ప్రక్కనే

మద్రాసు వచ్చిన ఓ అసామికి సినిమా యాక్టర్స్‌ని చూడాలని కోరిక పుట్టింది. దారిలో కనబడిన ఓ పెద్ద మనిషిని ఆపి.

"చిరంజీవి ఇల్లెక్కడండి?" అనడిగాడు.

"విజయశాంతి ఇల్లు ప్రక్కన" అన్నాడా పెద్దమనిషి.

"విజయశాంతి ఇల్లు ఎక్కడండి?" అని అయోమయంగా అడిగాడు.

"ఆ మాత్రం అర్థం కాదూ! చిరంజీవి ఇంటి ప్రక్కనే" అని విసుగ్గా చెప్పి వెళ్ళిపోయాడు.

ఇలా కాదు అనుకొని మరొకర్ని ఆపి,

"సార్ చిరంజీవి, విజయశాంతి ఇల్లు ఎక్కడ?" అని అడిగాడు.

"ఇద్దరి ఇళ్ళు ప్రక్క ప్రక్కనే" అని చెప్పి వెళ్ళిపోయాడు ఆ వ్యక్తి.

—పురిని నారాయణమూర్తి

## సూక్తులు

★ అన్ని విషయాలు మూలసూత్రాలకు లోబడి వుండాలి.

★ నిర్మాణ విషయంలో ఉదారంగా, సూత్రాల విషయంలో ఖచ్చితంగా ఉండాలి.

★ అందరి ప్రయోజనాలను కాపాడే స్ఫూర్తి హేతుబద్ధ ఆలోచనలు ఉత్తమమైనది.

★ శాస్త్రీయమైనది విమర్శకు భయపడదు— శాస్త్రమనేది సత్యం, పొరపాట్లు, పెడమార్గాల నూ ఓ గుణపాఠం నేర్చుకోవాలి. అట్లు సరిచేసుకున్నప్పుడే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

★ మాటలలో విధేయత కనబర్చడం, చేతలలో విరుద్ధంగా ఉండటం పెద్ద అవలక్షణం.

★ ఆత్మ విశ్వాసం, మనశ్శాంతి కోల్పోకుండా ఏ విషయం అయినా చేయగలవాడే విద్యావంతుడు.

★ తెలియని విషయం తెలియదని చెప్పడం. తెలిసిన దానిని తెలియచెప్పడం సరైనలక్షణం.

★ మంచి ఫలితాలు వాటంతటవే కృషితో వస్తాయి.

★ జీవితంపట్ల స్థిరమైన ప్రాపంచిక దృక్పథం కల్గి ఉండాలి.

★ ఐక్యత, అభివృద్ధి సమస్య యొక్క రెండు ముఖాలు.

★ పరాభవించడం, బెదిరించడం సరిచేసే పద్ధతి కాదు.

★ స్వార్థపరులు, సంకుచిత వాదులు అందరి గురించి ఆలోచించరు.

★ ప్రతి మనిషికి తిండి, నీరు, గాలి ఎంత అవసరమో శాస్త్రీయ అవగాహనతో సూత్రాల వినియోగం కూడా అంతే అవసరం.

★ నేను, నా గొప్ప అనే ధోరణి గలవారు పరిసరాలను క్రమబద్ధంగా క్షుణ్ణంగా అధ్యయనం చేయలేరు.

★ సామాన్యులను నిర్లక్ష్యం చేయడం ద్వేషించడం ఎంత తప్పో, విద్యావంతుల పట్ల వివక్షత చూపడం కూడా అంతే తప్పు.

★ సమున్నతమైన విధానం, దృక్పథం, విమర్శ అనుసరించదగినవి.

★ చెడ్డవారు కొద్దిమందే అయినా వారి వల్ల జరిగే హాని ఊహించలేనిది.

★ స్వయం పరిశీలన, ఆలోచన ద్వారా సంఘటనలను స్పష్టంగా మార్గదర్శకంగా మార్చగలగాలి.

—సేకరణ: శ్రీమతి కొల్లేపల్లి రత్నావతి, రాజమండ్రి